కథ

# పెళ్ళిచేసుకుందాం

''ప్రేమించినవాడు పెళ్ళికి ఒప్పుకుంటే సంతోషంగా తాళి కట్టించుకోటానికి, తల వంచాల్సిందిబోయి, చిన్న కారణంగా పెళ్ళి వద్దనటం ఏం బాగులేదు ప్రణీతా!''

''బాగా స్థితిమానం గలవాడు, నిన్నుకోరి వస్తుంటే, కాదనటం పిచ్చిగాక ఏమవుతుంది. కట్నం ప్రసక్తిలేకుండా చేసుకోటానికి ముందుకొచ్చిన ఆ శ్రీకాంత్‌ని కాదనటం నీ తెలివి తక్కువతనం. పొగరుమోతుతనం.''

''చిన్నప్పటినుంచీ దీని పట్టుదల దీనిదే. అది పట్టిన కుందేలుకి మూడే కాళ్లు అంటుంది. ఒట్టి మొండి. పెళ్లి విషయంలో అలాగే వుండి, మంచి సంబంధాన్ని కాలదన్నుకోకే''

''నీవు తప్ప ఎవరికి ఇలాంటి అవకాశం వచ్చినా, అదొక వరంలా భావిస్తారు కాని, నీలాగా ఇలా తిరస్కరించరు. దీనిని అమాయకత్వం అనుకోవాలో, మూర్ఖత్వం అనుకోవాలో అర్థంకావటంలేదు.''

ఇలా మేనమామ, తల్లి, అన్న, వదినలు ఒక్కొక్కరు ఒక్కోవిధంగా తనను తప్పుబడుతూ మందలిస్తుంటే, వారికి ఎలా చెప్పాలో అర్థంకాలేదు. తను ఎన్నిసార్లు చెప్పినా తప్పుబట్టడమేగానీ, తన ఆలోచనను, వ్యక్తిత్వాన్ని అర్థంచేసుకోరు.

నిజంగా శ్రీకాంత్‌ను మనసారా ప్రేమించింది ప్రణీత. పెళ్ళిచేసుకుని, అతనితో హాయిగా సంసారం సాగించాలని కలలుగన్నది. ప్రణీతను ప్రేమించి, ఎంతో ఇష్టపడిన శ్రీకాంత్ పెళ్ళిచేసుకోటానికి అంగీకరించాడు. అంతేకాదు ఇరువైపు పెద్దలను కూడా ఒప్పించాడు. కానీ చిన్న కారణం దగ్గర పేచీ పెట్టాడు.

అదే- ప్రణీత పెళ్ళి అయిన తర్వాత ఉద్యోగం చేయకూడదని, తనకు, పుట్టినవారికి, అత్తమామలకు సేవలు చేసుకుంటూ ఇంట్లోనే కాలక్షేపం చేయమని. కానీ అందుకు ఒప్పుకోలేదు ప్రణీత. అందుకే ఆ ఇంట్లో ఇంత రాద్ధాంతం. ఎటూ ఆ శ్రీకాంత్‌ని ఒప్పించలేరు. ప్రణీతనే ఒప్పించాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. కానీ ససేమిరా అంగీకరించనంటుంది. తల్లి, మేనమామ, అన్న, వదినలు సాధిస్తున్నారు.

కానీ ఆ ఇంట్లో ఒక్కరే ఆ విషయం గురించి ఏం మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయారు. ఆయనే ప్రణీత తండ్రి ఈశ్వరయ్య.

కూతురి వ్యక్తిత్వం గురించి బాగా తెలుసు ఈశ్వరయ్యకు. అందుకే ప్రణీత నిర్ణయాన్ని వ్యతిరేకించలేకపోతున్నాడు. మెల్లగా తడబడే అడుగులతో లోపలగదిలో కూర్చుని ఒంటరిగా ఆలోచిస్తున్న కూతురు దగ్గరకు వెళ్ళాడు. తండ్రిని చూసి కుర్చీలోంచి లేచింది.

''అమ్మా, వారిలాగా నిన్ను నిందించటానికి రాలేదు. నీవు సరైన నిర్ణయం తీసుకోగల శక్తి ఉన్నదానివని నాకు తెలుసు. ఎవరి మాటలను పట్టించుకోనవసరంలేదు. బాగా ఆలోచించి నీ మనసుకు ఎలా తోచితే, అలా చేయమ్మా'' అన్నాడు మరోకుర్చీలో కూర్చుంటూ.

ప్రణీత కూడా కూర్చుని ''నన్ను బాగా అర్థంచేసుకుంది ఈ ఇంట్లో మీరొక్కరే నాన్నా. నేను శ్రీకాంత్‌ని మనసారా ప్రేమించిన మాట నిజమే. తను కూడా నన్ను అంతగాఢంగా ప్రేమించాడు. మా పెళ్ళికి పెద్దలు కూడా ఒప్పుకున్నారు. కానీ నేను పెళ్ళయిన తర్వాత కూడా ఉద్యోగం చేస్తానంటే, శ్రీకాంత్ ఒప్పుకోలేదు.

''అమ్మా, వారిలాగా నిన్ను నిందించటానికి రాలేదు. నీవు సరైన నిర్ణయం తీసుకోగల శక్తి ఉన్నదానివని నాకు తెలుసు. ఎవరి మాటలను పట్టించుకోనవసరంలేదు. బాగా ఆలోచించి నీ మనసుకు ఎలా తోచితే, అలా చేయమ్మా'' అన్నాడు మరో కుర్చీలో కూర్చుంటూ.

మీకు తెలుసుకదా నాన్నా, నేను కష్టపడి చదివాను. మంచి మార్కులు తెచ్చుకున్నాను. అలాగే కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నాను. నాకు ఉద్యోగం చేయటమంటే ఇష్టం. నా ఇష్టాన్ని కాదంటున్న ఆ శ్రీకాంత్‌ని నేను పెళ్ళి చేసుకోలేను నాన్నా'' అని నిర్మొహమాటంగా, తన అభిప్రాయం ఇదీ అని చెప్పింది ప్రణీత.

తనకు ఇష్టం లేనప్పుడు బలవంతంగా ఒప్పించటం మంచిది కాదనేది ఈశ్వరయ్య అభిమతం. ''నీ ఇష్టం అమ్మా!'' అని మరోసారి చెప్పి, ముందుగదిలోకి వచ్చి కూర్చున్నాడు. తన ఆలోచనలన్నీ ప్రణీత చుట్టూనే తిరుగుతున్నాయి.

★ ★ ★

ఈశ్వరయ్యకు ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయి, అమ్మాయి. చేసేది గవర్నమెంట్ ఉద్యోగం కాకపోయినా, సొంతంగా ఒక లారీ ఉండటంతో దానిమీద వచ్చిన ఆదాయంతో బాగానే జరుగుతుండేది.

ఈశ్వరయ్యకు తాగుడు, జూదం లాంటివి ఏ దురలవాట్లు లేవు. భార్య తులశమ్మ కూడా పొదుపుగలది కావటంతో, ఏలోటూ లేకుండా కుటుంబం సాగిపోతుండేది.

ఈశ్వరయ్యకు కొడుకును, కూతురుని బాగా చదివించి, పెద్ద ఉద్యోగుల్ని చేయాలనే కోరిక బలంగా ఉండేది. అందుకే ఇద్దరినీ స్కూల్లో చేర్పించాడు.

చుట్టుపక్కల ఇళ్ళలోని పిల్లలు స్కూలుకి వెళ్ళమని మారాం చేసినా, ఈశ్వరయ్య పిల్లలు మాత్రం ఎన్నడూ అలా చేసేవాళ్ళుకాదు.

ఈశ్వరయ్య కూడా వాళ్ళు అడగకముందే కావలసినవి కొనిపెట్టి, ఏలోటూ లేకుండా చేసేవాడు.

దురదృష్టవశాత్తు కొడుకు శంకర్ డిగ్రీలో, కూతురు ప్రణీత ఇంటర్‌లో ఉండగా ఈశ్వరయ్యకు ఫెరాలసిస్ వచ్చింది. అది గమనించిన లారీ డ్రైవరు మోసంచేసి, నష్టం చూపించి, కొద్ది డబ్బులతో లారీని స్వంతం చేసుకున్నాడు. వచ్చిన డబ్బులు, జబ్బుకు, కుటుంబ ఖర్చులకు కరిగిపోయాయి.

ఫలితంగా శంకర్ డిగ్రీ పూర్తికాగానే, ఓ ప్రైవేటు ఉద్యోగంలో జాయినై కుటుంబాన్ని పోషించాల్సి వచ్చింది.

శంకర్‌కి వచ్చే ఆదాయం కుటుంబ ఖర్చులకే పూర్తిగా చాలని పరిస్థితిలో, ప్రణీతను చదివించటం కష్టమనే ఉద్దేశంతో, ఇంటర్‌తో చదువు ఆపేయమని చెప్పారు.

కానీ ప్రణీత ఒప్పుకోలేదు.

నా చదువు, నేను భారంకానని ఉదయం, సాయంత్రంవేళ కొంతమంది పిల్లలకు ట్యూషన్స్ చెబుతూ, ఇంట్లోవారిని దేనికీ అర్థించకుండా చదువును పూర్తిచేసి, తను అనుకున్న లెక్చరర్ ఉద్యోగాన్ని స్వయం కృషితో సాధించుకుంది ప్రణీత.

★ ★ ★

రెండు రోజుల నుంచి ఇంట్లో తల్లి, అన్న, వదినలు సాధిస్తూనే ఉన్నారు.

శ్రీకాంత్ మాటల్ని ఒప్పుకుని, పెళ్ళికి అంగీకరించమని, కానీ వాటిని పట్టించుకోకుండా ప్రణీత కాలేజీకి వెళ్ళి వస్తూ, తనపని తాను చేసుకుపోతూనే ఉంది.

ఆరోజు సాయంత్రం ఆరుగంటలవేళ తల్లి, అన్న, వదినలు గుడికి బయలుదేరి వెళ్ళారు. ఈశ్వరయ్య ''ఎప్పుడూ ఇంట్లోనే ఏం కూర్చోను తల్లీ!'' అంటూ పక్కవీధిలోని తన స్నేహితుడు రాఘవరావు ఇంటికె



ళ్ళాడు.

ప్రణీత ఒక్కడే మరుసటిరోజు చెప్పబోయే లెసన్సను చదువుకుంటూ, ఇంటిముందు ఉన్న చిన్నలాన్‌లో కూర్చుంది అప్పుడే కొంచెం చీకటి ఆవహిస్తుంది.

ఇంతలో చిన్నగా గేటు తీసుకుని వచ్చాడు శ్రీకాంత్. చూడగానే ఏమీ అర్ధంగాక ఆశ్చర్యంగా లేచి నిల్చుంది.

శ్రీకాంత్ నోరు తెరిచి మెల్లగా మాట్లాడసాగాడు.

''ప్రణీతా! రెండు రోజులుగా మన విషయం గురించే ఆలోచించాను. నీవు తీసుకున్న నిర్ణయం సరైనదేనని పిస్తుంది. నీ చదువు, తెలివితేటలు, వృత్తి నైపున్యాన్ని నాలుగు గోడల మధ్య బంధించాలని చూడటం నాదే పొరపాటు. నీవు ఉద్యోగం చేయటం సమంజసమే. ధనం తెచ్చిన అహంతో, నేనే తప్పుగా మాట్లాడాను. ఉద్యోగం చేసేది జీతం కోసం కాదని, ఆత్మ సంతృప్తి కోసం, వ్యక్తిగౌరవం కోసమని తెలుసుకున్నాను. అంతే కాదు, ఇప్పుడు నాలో కూడా మార్పు వచ్చింది. ఇప్పటి దాకా నేను, నాకు డబ్బు ఉంది, ఉద్యోగం చేయాల్సిన ఖర్మ ఏంటని, వ్యర్ధంగా తిరిగాను. పి.జి. చేసి కూడా సంఘానికి, పనికిరానివాడిగా మిగిలాను. ఇప్పుడు నేను కూడా ఉద్యోగానికి ప్రయత్నిస్తాను. పెళ్ళయిన తర్వాత కూడా నీవు ఉద్యోగం చేయటానికి నేను అంగీకరిస్తున్నాను. నామీద నమ్మకం ఉంటే, ఈ ఆహ్వానాన్ని మన్నించు. ఇద్దరం పెళ్ళిచేసుకుందాం.'' అన్నాడు చేయి ముందుకు చాపి.

శ్రీకాంత్ మాటల్లోని పట్టుదలను, పరిస్థితిని అర్థం చేసుకున్న తీరును గమనించి సంతోషంగా అతని ఆహ్వానాన్ని మన్నించి, ఆ చేతిని అందుకుంది ప్రణీత.

☆

**పి.ఎం. సుందరరావు**